



Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 252 | బుధవారం 04 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఆగని మారణ హోమం

- 787కు చేరిన మృతులు
- విద్యార్థినుల భౌతికకాయాలు సాముహిక ఖననం
- లెబనాన్ ప్రాంతాలను దురాక్రమణ చేసిన ఇజ్రాయిల్
- డ్రోన్లు, క్షిపణులతో ప్రతిదాడి చేస్తున్న ఇరాన్

టెహ్రాన్ - సూర్య వాస్తవం:

అమెరికా సామ్రాజ్యవాద కరాళనృత్యం 787 మంది ప్రాణాలను బలిగొంది. అమెరికా–ఇజ్రాయిల్ సేనలు, ఇరాన్ దళాల మధ్య వరుసగా నాలుగో రోజు కూడా భీకర పోరు కొనసాగుతుంది. మరోవైపు హిజ్బొల్లా కూడా రంగంలోకి దిగడంతో మధ్యప్రాచ్యంలో భయానక వాతావరణం కన్పిస్తోంది. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ మంగళవారం పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతంలో ఉన్న హిజ్బొల్లా టీవీ, రేడియో స్టేషన్ భవనాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తీవ్ర నష్టం వాటిల్లింది. హెజ్బొల్లాకు చెందిన అల్–మనార్ టీవీ ప్రసారాలు సుమారు గంట పాటు నిలిచిపోయాయి. శివారు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. అక్కడి ప్రజలను ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. మరోవైపు ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై అమెరికా–ఇజ్రాయిల్ సేనలు జరిపిన వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన 160 మంది అమాయక బాలికలను సాముహికంగా ఖననం చేశారు. వైమానిక దాడిలో బాలికల శరీరాలు ఛిద్రమై పోయాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన

- మిగతా 2లో..



## భారతీయుల భద్రతపై అరబ్ నేతలతో మోడీ చర్చలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్, కువైట్ యువరాజు హెచ్ హెచ్ షేక్ సబహ్ అల్- ఖలెద్ అల్- హమద్ అల్- ముబారక్ అల్- సబహ్ తో టెలిఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా దేశాలలో నివసిస్తున్న భారతీయుల

- మిగతా 2లో..



## ఖమేనీ మృతిపై మౌనమెందుకు ?

- కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మౌనం వహించడం పట్ల కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఖమేనీ హత్యపై మౌనం దాల్చడమనేది తటస్థ వైఖరి కాదని,

- మిగతా 2లో..



## మన ప్రతిష్ట దిగజారిపోతుంది

- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

ఖమేనీ హత్యపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించక పోవడం పట్ల కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ మౌనం వల్ల ప్రపంచ వేదికపై భారత్‌కు ఉన్న గౌరవం తగ్గిపోతుందని ఆయన అన్నారు. ఈ మేరకు



## లబ్దిదారుల ముఖగుర్తింపు చేపట్టాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- మెడికల్ కాలేజీలతో సర్కార్ దవాఖానాల అనుసంధానం
- విద్యాసంస్థల్లో మత్తు పదార్థాలపై ఉక్కుపాదం
- యూరియా యాప్‌పై గందరగోళాన్ని తొలగించాలి
- సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించండి
- జిల్లా కేంద్రంలో ఉండని అధికారులపై చర్యలు
- కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్– సూర్య వాస్తవం:

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం సమక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధ్యక్షతన

- మిగతా 2లో..

## మండలిలో వైసీపీని ఎదుర్కోవడమే ఎజెండా!

- చంద్రబాబు, పవన్ భేటీ
- చర్చలు జరిపిన నేతలు
- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్
- గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ
- జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం



అమరావతి - సూర్య వాస్తవం:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## సమాజంలో సామరస్యం పెంపొందించడమే ఇఫ్తార్ విందు లక్ష్యం

- ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనం
- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ

## భారతీయుల భద్రతపై
## అరబ్ నేతలతో మోడీ చర్చలు

(మొదటిపేజీ తరువాయి)
సంక్షేమం, భద్రత గురించి వారితో చర్చించారు. కాగా దేశం వద్ద ఇరవై ఐదు రోజులకు సరిపడా ముడి చమురు, శుద్ధి చేసిన ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రం తెలిపింది.

## ఖమేనీ మృతిపై
## మౌనమెందుకు ?

(మొదటిపేజీ తరువాయి)
ఇదొక పరాజయమని పేర్కొన్నారు. భారత విదేశ విధానం దిశ, విశ్వసనీయతపై సందేహాలను లేవనెత్తుతుందని అన్నారు. రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సమయంలో అంతర్జాతీయ సమస్యలపై తప్పనిసరిగా చర్చించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలపై ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం నుంచి కనీస అభ్యంతరం లేకపోతే అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘన సులభం అవుతుందని ఆమె పేర్కొన్నారు. చర్చలు కొనసాగుతున్న క్రమంలోనే ఒక దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ చేపట్టిన భారీ దాడిని విస్మరించి ప్రధాని మోదీ కేవలం యుఎఇపై ఇరాన్ ప్రతీకార దాడిని ఖండించడానికి మాత్రమే పరిమితమయ్యారని ఆమె తప్పుబట్టారు. దౌత్యంతోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఒక విదేశీ నాయకుడిని లక్ష్యంగా చేసుకుని హత్య చేసినా మన దేశం నుంచి ఇతర అంతర్జాతీయ చట్టం స్పష్టమైన రక్షణ లభించనప్పుడు మన విదేశాంగ విధానం దిశ, విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతుందన్నారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో వివిధ దేశాల్లో ఉన్న భారతీయల రక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## మన ప్రతిష్ట
## దిగజారిపోతుంది

(మొదటిపేజీ తరువాయి)
సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'ఈ ఘర్షణపై భారత్ నైతికంగా, స్పష్టంగా వ్యవహరించాలి. అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ ప్రాణాల రక్షణ కోసం స్పష్టంగా మాట్లాడే ధైర్యం మనకు ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాలు శాంతియుత పరిష్కారంపై ఆధారపడి ఉంది. ఎప్పటికీ అదే విధంగా కొనసాగాలి. ప్రపంచ వ్యవస్థను నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యకు ప్రధానమంత్రి మద్దతు ఇస్తారా? ప్రధాని మోడీ ఈ విషయంలో మాట్లాడాలి. ఇప్పుడైనా మౌనం వీడాలి. ఈ మౌనం ప్రపంచంలో భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

## మండలిలో వైసీపీని
## ఎదుర్కోవడమే ఎజెండా!

కూడా సమీక్షించారు. త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

## అంగన్వాడీ టీచర్ల నిరసన

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలో అంగన్వాడీల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ గుత్తి ఎన్టీఆర్ సర్కిల్లో అంగన్వాడీ టీచర్లు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీ టీచర్ కళ్యాణి మాట్లాడుతూ. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో జరుగు మహా ధర్నాకు వెళ్తున్న వారిని అక్రమం గా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆ పలేరన్నారు.అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.



# ఆగని మారణ హోమం

(మొదటిపేజీ తరువాయి)
ఏడు ఎమిరేట్స్లో ఒకటైన ఫుజైరాలోని చమురు కేంద్రం నుంచి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. అంతకుముందు చమురు కేంద్రం పైకి దూసుకొచ్చిన డ్రోన్ను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అయినప్ప టికీ శకలాలు చమురు పరిశ్రమ జోన్లో పడడంతో మంటలు వ్యాపించాయి. అమెరికా దాడిలో ఇరాన్లోని భూగర్భ నతంజ్ ఫ్యూయల్ ఎన్రిచ్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఈపీ) ప్రవేశ భవనాలు కొంతమేర దెబ్బతిన్నాయని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ తెలిపింది. అయితే అణుధార్మిక పరిణామాలు సంభవించే ప్రమాదం ఏమీ లేదని చెప్పింది. ఇరాన్ సైనిక, ప్రభుత్వ కార్యాలయాలే లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులు జరపగా ఇరాన్ కూడా ప్రతీకార దాడులు జరిపింది. గల్ఫ్లోని అమెరికా స్థావరాలపై పెద్ద ఎత్తున దాడులు చేసింది. దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో సంక్షోభం తీవ్రతరమైంది. భూతల దాడులు జరిపే అవకాశాన్ని తోసిపుచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. దీర్ఘకాల పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇజ్రాయిల్ మాత్రం భూతల దాడులు ఆచరణ సాధ్యం కావని చెప్పింది. మరోవైపు ఒత్తిడికి తలవంచబోమని, అయితే చర్చలకు సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ తెలిపింది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ప్రకటించింది. వ్యూహాత్మక సముద్ర మార్గంలో ప్రయాణించేందుకు ఏ నౌక అయినా ప్రయత్నిస్తే పేల్చివేస్తామని హెచ్చరించింది.

**దాడులు-ప్రతి దాడులు**

అమెరికా-ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న దాడులలో మరణించిన వారి సంఖ్య 787కు చేరింది. కెర్మన్ రాష్ట్రంలో జరిగిన దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్సకు చెందిన 13 మంది చనిపోయారు. దాడులతో భీతిల్లుతున్న ఇరాన్ ప్రజలను తాజాగా భూ ప్రకంపనలు వణికించాయి. దక్షిణ ప్రాంతంలోని గెరాష్ సమీపంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఇజ్రాయిల్ సేనలు ముందుకు సాగుతుండడంతో సరిహద్దుల వద్ద లెబనాన్ ప్రభుత్వం దళాల మోహరింపును పెంచింది. లెబనాన్లో మరిన్ని స్థావరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సైన్యానికి అధికారం ఇచ్చారు. సరిహద్దున ఉన్న ప్రజలపై కాల్పులు జరగకుండా నివారించడానికే ఈ చర్య తీసుకున్నామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు. లెబనాన్లోని హెజ్బొల్లా లక్ష్యాలపై ఇజ్రాయిల్ సేనలు విరుచుకుపడుతున్నాయి. ఇదిలావుండగా ఫ్రాన్స్లోని అక్రోటిరిలో ఉన్న బ్రిటీష్ రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) స్థావరంపై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. దీంతో సైప్రస్కు క్షిపణి, డ్రోన్ నిరోధక వ్యవస్థలను పంపాలని ఫ్రాన్స్ యోచిస్తోంది. ఒమన్లోని ఓ ఓడరేవులో ఉన్న ఇంధన ట్యాంకులపై కూడా ఇరాన్ డ్రోన్లను ప్రయోగించింది. ఖతార్లోని ఇజ్రాయిల్, అమెరికా సైనిక స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసింది. త్రివిధ దళాలకు చెందిన విధ్వంసక డ్రోన్లు ఆక్రమిత ప్రాంతాలలోని ఇజ్రాయిల్ సైనిక ప్రాంతాలను, అల్-ఉదెయిద్లోని అమెరికా దళాల స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ సైన్యం తెలిపింది. ఇరాన్ అధ్యక్ష కార్యాలయాన్ని, సెక్యూరిటీ కౌన్సిల్ భవనాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇజ్రాయిల్ చెప్పింది. వాటిపై భారీగా ఆయుధాలు ప్రయోగించి ధ్వంసం చేశామని తెలియజేసింది. సౌదీ అరేబియాలోని రియాద్లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంపై కూడా ఇరాన్ రెండు డ్రోన్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఆ భవనం స్వల్పంగా దెబ్బతిన్నది.

**ఆర్థిక ప్రభావంపై ఇప్పుడేమీ చెప్పలేం : ఐఎంఎఫ్**

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలిపింది. ఆ ప్రాంతంలో వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడిందని, ఇంధన ధరలు పెరుగుతున్నాయని పేర్కొంది. పశ్చిమాసియాపై కానీ, ప్రపంచంపై కానీ పడే ఆర్థిక ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని అంటూ ఘర్షణలు ఎంత కాలం కొనసాగుతాయనే విషయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పింది.

**విమాన సర్వీసుల పునరుద్ధరణ**

ఇరాన్లో నివసిస్తున్న భారతీయులకు మన రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. పరిస్థితులను జాగ్రత్తగా గమనించాలని, సాధ్యమైనంత వరకూ ఇళ్లలోనే ఉండాలని, బయట తిరగవద్దని సూచించింది. రాయబార కార్యాలయం నుంచి అందే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరింది. ఇరాన్లో విద్యార్థులు సహా దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. విమానాశ్రయాలలో చిక్కుకుపోయిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ సహా పలు భారతీయ విమానయాన సంస్థలు మస్కట్, ఒమన్, జోర్డాన్, జెడ్డా తదితర గల్ఫ్ నగరాలకు సర్వీసులను పునరుద్ధరించాయి. దుబాయి, అబూదాబీ విమానయాన సంస్థలు కూడా పరిమిత సంఖ్యలో సర్వీసులు నడుపుతామని తెలిపాయి. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో 80 సర్వీసులు, ముంబయి విమానాశ్రయంలో 107 సర్వీసులను రద్దు చేశారు. బెంగళూరులో 42 విమానాలు, చెన్నైలో 30 విమానాలు రద్దయ్యాయి. ఇండియన్ ఎయిర్లైన్స్ సంస్థ గత మూడు రోజులలో 1,117 విమాన సర్వీసులను రద్దు చేసింది. ఇదిలావుండగా పవిత్ర రంజాన్ మాసంలో ఉమ్రా కోసం మక్కాకు వెళ్లిన వేలాది మంది భారతీయ ముస్లింలు అక్కడే చిక్కుబడి పోయారు. విమాన సర్వీసులు లేకపోవడంతో వారంతా మక్కా, మదీనాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# లబ్ధిదారుల ముఖగుర్తింపు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)
కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' అమలుపై సీఎం కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగయిజేషన్) అమలు చేయాలని చెప్పారు. దీనివల్ల అసలైన లబ్దిదారులకు మేలు జరుగుతుందనీ, అక్రమాలను నివారించవచ్చని తెలిపారు. ఇటీవల ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడం వల్ల మూడు లక్షల మంది అనర్హుల పేర్లను తొలగించామని సీఎం ప్రస్తావించారు. సాంకేతికతను సక్రమంగా వినియోగించు కోకపోవడం వల్లే ఇలాంటి పొరపాట్లు దొర్లాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు.

**అందర్నీ భాగస్వామ్యల్ని చేయండి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్లు, చైర్మెన్లు, కార్పొరేటర్లు, మేయర్లను భాగస్వాములను చేయాలన్నారు. వారికి జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారి విధులు, బాధ్యతలకు సంబంధించి ప్రింటెడ్ మెటీరియల్ అందించాలని ఆదేశించారు.

**ప్రభుత్వ ఆస్పత్రులకు మెడికల్ కాలేజీల అనుసంధానం**

మెడికల్ కాలేజీలతో సర్కార్ దవాఖానాలను అనుసంధానం చేయాలన్నారు. పీహెచ్సీలు, సీహెచ్సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు రోగులను ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సంస్థల్లోని అత్యాధునిక సాంకేతికత, వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**యూరియా యాప్లో మార్పులు**

యూరియా యాప్లో గందరగోళాన్ని తొలగించి, సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలన్నారు. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు వివరించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి, సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలనీ, ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుందో రైతులకు తెలియజేయాలని సూచించారు. "మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలి. పంట మార్పిడి, వైవిధ్య ప్రయోజనాలను వివరించాలి. వ్యవసాయ, పౌర సరఫరాల శాఖలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలి" అని దిశానిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు చెల్లించాలన్నారు. పిల్లలకు పోషకాహారం అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

**సిటీల్లో హాస్టళ్ల వివరాలు సేకరించండి**

నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేయాలనీ, వాటి అనుమతులు, పర్యవేక్షణ, యాజమాన్యాలకు జవాబుదారీతనంపై నిఘా పెట్టాలని సూచించారు.

**'మత్తు' నివారణ బాధ్యత కాలేజీ యాజమాన్యాలదే**

పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగం జరిగితే అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పీఈటీలతో పాటు సైకాలజిస్టులు కూడా ఉండేలా చూడాలని చెప్పారు.

**సోలార్ను ప్రోత్సహించండి**

సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ పంప్సెట్లకు బదులు సోలార్ పంప్సెట్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఇండ్లపై సోలార్ ప్యానల్స్ అమర్చుకుని, స్వీయ అవసరాలకు వాడుకొని, మిగులు విద్యుత్ను గ్రిడ్కు అనుసంధానం చేసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. దీనివల్ల ప్రజలకు లభించే అదనపు ఆదాయంపై గ్రామస్థాయిలో విద్యుత్శాఖ అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

**రోడ్ల మరమ్మతులు చేయండి**

రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాలను గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అందుకోసం ప్రత్యేక వాట్సప్ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల వెంట చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేసే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు.

## సమాజంలో సామరస్యం
## పెంపొందించడమే ఇఫ్తార్ విందు లక్ష్యం

- ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనం
- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ






**అనంతపురం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన నేడు ఆంధ్రరత్న భవన్ లో ముస్లిం సోదర, సోదరీమణులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... శాంతి, సహనం, సేవాగుణం, ఆధ్యాత్మిక చింతనతో కూడినదే ఈ రంజాన్ మాసమని.... సమాజంలో సామరస్యం పెంపొంది ంచడమే ఇఫ్తార్ విందుల లక్ష్యం అని తెలిపారు.ఈ పవిత్ర రోజుల్లో ప్రార్థనలు ఫలించాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ, అల్లా దయ రాష్ట్రంపై ఎప్పుడు ఉండాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా ముస్లింలకు ఆనాడు మహానేత వైస్సార్ 4 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. ఎంతోమంది బిడ్డలు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నట్లు చెప్పడం సంతోషాన్ని కలిగించిందన్నరు . ముస్లిం, మైనారిటీల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎందాకైనా పోరాటం చేస్తుందని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ మాట్లాడుతూ....రంజాన్ మాసం శాంతి, సహనం, సేవాభావాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సామరస్యం పెపొందించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్ల ప్పుడూ లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వానికి కట్టుబడి ఉంటుందన్నారు. రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనం. రాష్ట్ర ప్రజలందరూ ఆ అల్లా దయతో సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ, ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ చైర్మన్ దాదా గాంధీ,వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం

## మసకబారుతున్న ఎర్రజెండా



పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో 34 ఏళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్ష కూటమి, ఒక్కసారి అధికారం కోల్పోయాక తిరిగి కోలుకోలే నంతగా బలహీన పడటం భారత రాజకీయాల్లో ఒక హెచ్చరిక. కమ్యూ నిస్టుల తొలినాళ్ల విజయానికి భూసంస్కరణలు వెన్నెముకగా నిలిచాయి. పేద రైతులకు భూమిని పంచడం ద్వారా వారు పటిష్టమైన ఓటు బ్యాంకును సృష్టించుకున్నారు. అయితే, కాలక్రమేణా ఆ భూమి చిన్న చిన్న ముక్కలై, వ్యవసాయం లాభసాటిగా లేక యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం ప్రారంభమైంది. వ్యవసాయంపై ఆధారపడిన పాత తరం తర్వాత వచ్చిన కొత్త తరం ఆకాంక్షలను గుర్తించడంలో సిపిఎం విఫలమైంది. దాదాపు మూడు దశాబ్దాల పాలన తర్వాత, రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అవసరమని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య వేగంగా అడుగులు వేశారు. అయితే, టాటా నానో ప్లాంట్ కోసం సింగూర్‌లోనూ, కెమికల్ హబ్ కోసం నందిగ్రామ్‌లోనూ బల వంతంగా భూసేకరణ చేపట్టడం పార్టీకి శాపమైంది. వ్యవసాయం మన పునాది.. పరిశ్రమ మన భవిష్యత్తు అనే నినాదం క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరలేదు. ఫలితంగా, తమను నమ్ముకున్న రైతాంగం తమకు వ్యతిరేకంగా మారుతుంటే కమ్యూనిస్టులు గ్రహించలేకపోయారు.సుదీర్ఘ పాలన వల్ల పార్టీ క్యాడర్‌లో విపరీతమైన అహంకారం పెరిగింది. గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న సమస్యల నుండి పోలీసు స్టేషన్ల వరకు అంతా పార్టీ కనుసన్నల్లోనే నడిచేది. ఈ పార్టీతంత్రం సామాన్య ప్రజలకు భారంగా మారింది. చివరకు మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ మా-మతి- మానుష్ అంటే తల్లి-నేల-ప్రజలు నినాదంతో ప్రజల్లోకి వెళ్లినప్పుడు, కమ్యూనిస్టుల ఉక్కుకోటలు పేకమేడల్లా కూలిపోయాయి. 2011లో అధికారం కోల్పోయిన తర్వాత, కమ్యూనిస్టుల ఓటు బ్యాంకును మమతా బెనర్జీ తన సంక్షేమ పథకాలతో పూర్తిగా తనవైపు తిప్పుకున్నారు. ఉచిత బియ్యం, సైకిళ్లు , కన్యాశ్రీ వంటి పథకాలు గ్రామీణ ఓటర్లను టిఎంసికి శాశ్వత మద్దతుదారులుగా మార్చాయి. కమ్యూనిస్టులు సిద్ధాంతాలకే పరిమితం కాగా, మమత ప్రత్యక్ష ప్రయోజనాలపై దృష్టి పెట్టారు.కమ్యూనిస్టులు బలహీనపడటంతో ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి బీజేపీకి అవకాశం దక్కింది. ముందు మమతను దించాలి, ఆ తర్వాత మనల్ని మనం చూసుకోవచ్చు అనే భావనతో కమ్యూనిస్టుల ఓటు బ్యాంకులో గణనీయమైన భాగం బీజేపీ వైపు మళ్లింది. 2019 ఎంపీ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు ఒక్క సీటు కూడా గెలవలేక సున్నాకే పరిమితం కావడం వారి దయనీయ స్థితికి అద్దం పడుతోంది. సిద్ధాంతపరమైన మొండితనం, మారుతున్న కాలానికి అనుగుణంగా మారకపోవడం, ప్రజల మనో భావాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం బెంగాల్ కమ్యూనిస్టులను పతనం అంచుకు నెట్టాయి. ప్రస్తుతం బెంగాల్ రాజకీయాల్లో వారు మనుగడ కోసం పోరాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. శ్రామిక వర్గ జయకేతనం 'ఎర్రజెండా'భారత్‌లో శతవసంతాలు దాటి నూరేళ్ళ పండుగ జరుపుకుంటోంది. 1925డిసెంబర్ 25నపుట్టిన భారత కమ్యూ నిస్ట్ పార్టీ ఈ ఏడాదితో వందేండ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుంది. మార్క్సిస్టు మూల సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న వర్గ పోరాటంతో ప్యారిస్ కమ్యూన్ ఏర్పడినప్పటికీ అది వేళ్ళమీద లెక్కబెట్టుకునే రోజులే మనుగడలో ఉంది. ప్యారిస్ కమ్యూన్ గుణపాఠం తీసుకొని వ్లాదిమిర్ ఇల్విచ్ లెనిన్ రష్యాలో శ్రామిక వర్గ రాజ్యాంగ యంత్రం అనే మార్క్సిస్టు సిద్ధాంతం వెలుగులో 1919 అక్టోబర్ విప్లవం విజయవంతం చేశాడు.సువిశాల భూభాగం, ప్రజా బాహుళ్యంగల రష్యాలో ఎర్రజెండా ఆవిర్భావంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రామిక వర్గంపై ఆ ప్రభావం పడింది. మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు ఏర్పాటు చేసుకున్న 'కమ్యూనిస్టు ఇంటర్నేషనల్'కూడా ప్రపంచం అంతటా ఎర్రజెండా విస్తరణకు బాటలు వేసింది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐకి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. భారత స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్‌తో కలిసి పని చేయడంతో పాటు బొంబాయి డాక్ కార్మికుల సమ్మె లాంటి చారిత్రక తిరుగుబాటుకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. భారత దేశం కంటే ఆలస్యంగా ఎర్రజెండా ఆవిర్భావం జరిగిన పొరుగు దేశం చైనాలో మావో నేతృత్వంలో 1949లోనే విప్లవం విజయవంతమైంది . అక్కడ కమ్యూనిస్టులు అధికారంలోకి రాగలిగినప్పటికీ ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ దశలోనే ఉంది.విభిన్న భౌగోళిక వాతావరణం, విభిన్న జీవన విధానాలు, సంస్కృతి,వర్గ పొందికల్లో వ్యత్యాసాల మూలంగా దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వ హించినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ అధికారం లోకి రాలేకపోయింది. ఇదే సమయంలో తెలుగు నాట ముఖ్యంగా నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది. ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంథాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.దేశ స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే తొలిదశ ఎన్నికల్లో తలపడి నప్పటికీ కమ్యూనిస్టు పార్టీ అధికారం లోకి రాకపోయినప్పటికీ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా నిలిచి పోరాడింది.బారత కార్మిక వర్గంలో తనదైన పునాదులు విస్తరించుకున్నది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో తొలి సారిగా ఎన్నికల ద్వారా సంకీర్ణ రాజకీయ అధికారం పంచుకున్న కమ్యూనిస్టు పార్టీలు అటు తర్వాత పశ్చిమ బెంగాల్, త్రిపుర,కేరళ వంటి కీలక రాష్ట్రం లలో అధికారంలోకి రాగలిగినప్పటికీ కేంద్రం లో అధికారం చేపట్ట గలిగిన స్థితి రాలేదు. ఒకానొక దశలో జ్యోతిబస్‌కు సంకీర్ణ రాజ కీయాల్లో ఆ అవకాశం వచ్చినప్పటికీ సైద్ధాంతిక వెలుగు లో ఆనాటి సిపియం తిరస్క రణతో ఆ అవకాశం చేజారింది. నూరేళ్ళ కమ్యూనిస్టు పార్టీ ప్రయాణంలో కష్టాలు, కన్నీళ్ళతో నే ఎర్రజెండా చరిత్రను నిలబెట్టుకుంది. కార్మికవర్గం లోనూ, రైతాంగం లోనూ నీతి, నిజాయితీలతో ఉద్యమాలు నిర్మించి అనేకమైన త్యాగా లతో, రక్త తర్పణా లతో చారిత్రిక చాళ్ళను నిర్మించుకుంది ఎర్రజెండా, భారతదేశంలో కాల,మాన పరిస్థితులు, శత్రువులను అంచనా వేయడంలో,సరైన పోరాటం పందాలను ఎన్నిక చేసుకోవడంలో విఫలం అయిన కమ్యూనిస్టు పార్టీ, వివిధ రకాల సూత్రీక రణలతో అతివాద, మితవాద తప్పిదా లకు గురై చీలికలు, పేలికలుగా మారి తనకు తానే బలహీనం అయ్యింది. 1955 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో ప్రధాన ప్రతిపక్షం గా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ సోషలిస్టు విధానాలు ప్రజల్లో ప్రచారంలో పెట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ సోషలిస్టు ప్రచారాన్ని అధిగమించలేకపోయింది. సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది.

# త్రిశూల్ వ్యూహంతో అమెరికా ఇజ్రాయిల్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



యుద్ధం అంటే గగనతలంలో గర్జించే జెట్లు, నేలపై పేలే బాంబులు అనుకుంటాం. కానీ ఈసారి కథ అక్కడి నుంచి మొదలుకాలేదు. ఇరాన్‌పై దాడి చేయాలనుకున్న ఇజ్రాయెల్-అమెరికా అద్భుతమైన స్కెచ్ వేశాయి. బాంబర్లు, జెట్లు ఇలా దాడిచేస్తే.. ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ వారిని అడ్డుకుంటుందని తెలుసు. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేశాయి. అసలు యుద్ధం మొదలైంది ఆకాశంలో కాదు... రాడార్ స్క్రీన్లపైనే.. ఇజ్రాయెల్-అమెరికా చేపట్టిన సైబర్, డెకాయ్, ఎయిర్ అటాక్‌లకు ఇరాన్ బిత్తరపోయింది. ఆధునిక వార్‌ఫేర్ ఏలా మారిపోతోందో ఈ అటాక్ కళ్లకు కట్టింది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎందుకు పనిచేయలేకపోయింది? సూటిగా చెప్పాలంటే ? ప్రత్యర్థి సాంకేతిక సామర్థ్యం పూర్తిగా ఇరాన్‌కు అందనంత స్థాయిలో ఉంది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్‌ను చేధించడం కోసం యుఎస్ సైబర్ వార్‌ఫేర్‌ను ఉపయోగించింది. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ ఆపరేషన్లు కలిసి రాడార్‌లలోకి నకిలీ డేటాను పంపించాయి. అంటే పదుల సంఖ్యలో యుద్ధ విమానాలు ఇరాన్ వైపు దూసు కొస్తున్నట్లుగా స్క్రీన్‌పై కనిపిస్తుంది.కానీ అవన్నీ వాస్తవాలు కావు. ఇరాన్‌లోని స్వదేశీ బావర్ వ్యవస్థలైనా, రష్యా నుంచి వచ్చిన ఎస్-300, ఎస్-400 బ్యాటరీలైనా? ఒకేసారి వచ్చిన డిజిటల్ దాడిని తట్టుకోలేకపోయాయి. రాడార్ ఆపరేటర్‌కు ఏది నిజం? ఏది మోసం? అర్థం కాని పరిస్థితి.ఇదే సమయంలో వందల సంఖ్యలో డీకాయ్ డ్రోన్లు ప్రయోగించారు. ఇవి చిన్నవే. కానీ రాడార్‌కు మాత్రం ఎఫ్-15లు, ఎఫ్-16ల పెద్ద స్క్వాడ్రన్‌లా కనిపిస్తాయి. టెహ్రాన్ వైపు భారీ దళం దూసుకొస్తున్నట్టే సిగ్నల్ వస్తుంది. ఇక ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ పూర్తిగా వాళ్ల వెంట పడుతుంది. డెకాయి డ్రోన్లను డీల్ చేయడంలో ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ బిజీగా ఉన్న సమయంలోనే ఎఫ్-35, ఎఫ్-22లు ఇరాన్ భూభాగంపైకి వెళ్తాయి. అసలేం జరుగుతుందో ఇరాన్‌కు అర్థమయ్యే లోపు వారి రక్షణ ముఖద్వారం బద్ధలైపోయింది.

**మొదటి దశ:** టెహ్రాన్, ఇలామ్, ఖుజెస్టాన్ ప్రాంతాల్లోని సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సైట్లు, రాడార్ స్టేషన్లు, గాలి రక్షణ హెడ్‌క్వార్టర్స్‌ను టార్గెట్ చేశారు.

**రెండో దశ:** బ్యాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, నిల్వ కేంద్రాలపై దాడులు.

**మూడో దశ:** సైనిక తయారీ పరిశ్రమలపై దృష్టి. దీర్ఘకాల యుద్ధ సామర్థ్యాన్ని బలహీనపరచడం లక్ష్యం.

ఇక అసలైన భౌతిక దాడి సముద్రంపై నుంచి మొదలైంది. ఇరాన్‌కు దగ్గరలో ఉన్న అమెరికన్ మిస్సైల్స్ పైకి లేచాయి. ఇవి శత్రు రాడార్‌లకు దొరక్కుండా చాలా తక్కువ ఎత్తులో దూసుకెళ్లాయి.అంతకుముందే ఎఫ్-35, ఎఫ్-22 రాప్టర్లు వెళ్లడంతో అప్పటికే రాడార్‌లపై తప్పుడు లక్ష్యాలు, ఎలక్ట్రానిక్ జ్యామింగ్? ఈ కలయి కతో ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ విచ్ఛిన్నం అయింది. ఆ సమయంలో చాలా తక్కువ ఎత్తులో వచ్చి టామ్‌హాక్స్ ఎస్-300,ఎస్-400 రాడార్ సైట్లు, కమాండ్ బంకర్లపై దాడి చేశాయి. సో.. శత్రుదేశాల ఎటాక్స్‌ను డేగకళ్లతో పర్యవేక్షించే డిఫెన్స్ సిస్టమ్‌కు కళ్లే లేకుండా పోయాయి. ఇరాన్ గగనతలంపైకి తమ ఫైటర్‌జెట్లు దూసుకువెళ్లేలా సేఫ్ కారిడార్‌ను విజయవంతంగా సృష్టించిన తర్వాత అసలు కథ మొదలైంది.

ఎయిర్‌డిఫెన్స్, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేశాక.. ఇక మిగిలిన లక్ష్యాలను చేధించడానికి బాంబర్స్ వచ్చేశాయి. అవి ఒకేసారి జెడామ్ బాంబులు, మిస్సైళ్లను తీసుకెళ్లగలవు. ఇందుకోసం బి-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లను తెచ్చారు. ఇవి భూమి మీదనే కాదు.. భూమిలోపల ఉండే బంకర్లను కూడా ధ్వంసం చేయగలుగుతాయి. అదే సమయంలో జోర్డాన్, యూఏఈ లోని అమెరికన్ బేస్‌ల నుంచి.. ఎఫ్-15ఇ స్ట్రయిక్ ఈగల్స్ దూసుకొచ్చాయి. ఒక్కో జెట్ 19 జెడామ్ లు లేదా 28 చిన్న డయామీటర్ బాంబులు మోసుకెళ్లగలదు. ఇవి ప్రధానంగా మూవింగ్ టార్గెట్స్ ను చేధిస్తాయి. అంటే వాహనాలపై నుంచి ప్రయోగించే సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ సిస్టమ్‌ను గుర్తించి దానని ధ్వంసం చేస్తుందన్నమాట.. లోయల్లో దాగి ఉన్న మొబైల్ మిస్సైల్ లాంచర్లు, కమాండ్ సెంటర్లపై దాడులు జరిపాయి.ఎంతగా ప్లాన్ చేశారు అంటే ఒకసారి దాడి చేసిన తర్వాత ఇవి తిరిగి వెళ్లవు. మళ్లీ దాడి చేయడానికి వీలుగా వీటికి ఆకాశంలోనే ఇంధనాన్ని నింపే కూడా చేశారు. అందుకే ఇంధనాన్ని నింపుకుని వచ్చి మళ్లీ మళ్లీ దాడులు చేశాయి. ఇజ్రాయెల్, యుఎస్ అంత కచ్చితమైన స్కెచ్ వేశాయి. ఓ పక్క వైమానిక దళం డిస్ట్రక్షన్ చేసేస్తుంటే.. దానికి సపోర్ట్‌గా యూ ఎస్ నేవీ రంగంలోకి వచ్చింది. రెండు గంటల తర్వాత జూ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లు అరేబియా సముద్రం నుంచి ఆపరేషన్ మొదలుపెట్టింది. దూరంగా ఉన్న అమెరికాను ఏం చేయలేక యుఎస్ మిత్రదేశాలపై దాడులు మొదలు పెట్టింది. యూఏఈలోని ఎయిర్ బేస్ పై దాడి చేశారు. బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయాన్ని కూడా టార్గెట్ చేశారు. సోమవారం సాయంత్రానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయంపై కూడా దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది.డికాయ్ ఆపరేషన్స్, సైబర్ ఎటాక్, వంటివి ఫ్యూచర్ వార్‌ఫేర్‌లో ఏ రీతిలో ప్రాధాన్యం వహిస్తున్నాయో ఈ ఆపరేషన్ చెబుతోంది.

# కూటమిలో మిత్రుల మధ్యే పోటీ



ఏలూరు - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.

కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిం స్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

# మహిళల భద్రతపై అవగాహన సదస్సు

## - సీఐ నరసింహులు


**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మహిళల భద్రత పై మైనార్టీ రెసి డెన్షియల్ గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐ. నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు డయల్ 112 సేవలు, శక్తి యాప్ వినియోగం, బాల్య వివాహాల నివారణ, వరకట్న వేధింపులు మరియు కుటుంబ హింసపై చట్టపరమైన చర్యల గురించి వివరించారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేదా వేధింపులు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందని సీఐ. తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం ద్వారా వేగంగా సహాయం పొందవచ్చని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వరకట్న వేధింపులు, కుటుంబ హింస వంటి సమస్యలను మహిళలు సహించ



కుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో చట్టాలపై అవగాహన పెరిగి, తమ భద్రతపై మరింత జాగ్రత్త వహించే అవకాశం ఉంటుందని సిఐ నరసింహులు పేర్కొన్నారు. మహిళల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.

# వెలగని వీధి దీపాలు

## - అడుగు పెట్టాలంటే భయం.. భయంగా ప్రజలు



**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండల పరిధిలోని స్థానిక యాదవ్ బజారు, వడ్డెర బజారు, శివాలయం వీధి, పలు గ్రామాల్లో 6 నెలలకు పైగా పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. సాయంత్రం పూట 6 గంటలు దాటితే చిన్న పిల్లలు, పెద్దలు, ముసలి వాళ్లు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింద్ని వేసవి కాలం కావడంతో సాయంత్రం వేళన పాములు, తేళ్లు లాంటి విషపురుగులు బయ టికి వస్తున్నాయి. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఇండ్ల నుండి బయటకు వెళ్లాలంటే గ్రామల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధి అయిన వేముల గ్రామంలో ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకోకపోవడం పట్ల గ్రామాలలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ చొరవ తీసుకొని వీధిలైట్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.


# విద్యుత్ అంతరాయానికి సహకరించండి

## - విద్యుత్ శాఖ ఏఈ



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 04.03.2026 తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 5 గంటల 30 నిమిషాల వరకూ వరకు 33కేవీ జంగం రెడ్డిపల్లి ఫీడర్, 33కెవి బలపనూరు ఫీడర్ మెయింటెనెన్స్ కోసం132/33 కె వి బలపనూర లో ఎల్ సి తీసుకోవడం జరుగుతుంది. ఇందు వల్ల అంకాలమ్మగూడురు, కోరగుంటపల్లి, జంగారెడ్డిపల్లి, సుంకేసుల మరియు రావులకోలను సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరం కలుగుతుంది. కావున వినియోగదారు సహకరించ వలసిందిగా కోరడం జరుగుతోందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

# మూతపడ్డ గండి అంజన్న ఆలయం



**చక్రాయపేట - సూర్య వాస్తవం:** చక్రాయపేట మండలంలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము మూసివేసినట్లు ఆలయ అధికారులు పట్టెం గురు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా అధికారుల ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వాముల మాజీ చైర్మన్ వెంకటస్వామి నేతృత్వంలో ఉదయం 9.30గంటలకు ఆలయం తలుపులు మూసివేసినట్లు తెలిపారు. తిరిగి బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన,నివేదన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం 7గంటల నుండి యధావిధిగా భక్తులకు సర్వ దర్శనం కల్పించనున్నారు.

# సుంకులమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

## - అందించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలం ఎద్దులపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు నూతన సుంకులమ్మ దేవాలయం నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం ఎద్దులపల్లి గ్రామ పెద్దలు గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాంని ఆయన తనయుడు యువనేత పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌ని ఆలూరు పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిసి దేవాలయం నిర్మాణానికి విరాళం అడిగిన వెంటనే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్ ఎద్దులపల్లి గ్రామ పెద్దలకు 50,000 వేల రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎద్దులపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానం

- ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రశాంతి నిలయాలు
- పురాణ ఇతిహాసాలు సమాజానికి నిత్య దిక్సూచికలు
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానమని రాజ్యసభ మాజీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కొండు కుంట గ్రామంలో గత 20 రోజులుగా భాగవత భక్త సమాజం దంతలపల్లి శాఖ ఆధ్వర్యంలో భాగవత సంతాపం జరుగుతోంది. రాజ్యసభ మాజీ సభ్యులు,ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మంగళవారం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ భాగవతులు రామకంచిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మికవేత్తలతో సమాలోచనలు ఆధునిక మానవునికి ప్రశాంతిని కలిగిస్తాయన్నారు. అటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమమే భాగవత సప్తాహం అన్నారు. రామాయణం ఒక ఆదర్శ శాస్త్రం, మహాభారతం ఒక ధర్మ శాస్త్రం కాగా మహా భాగవతం మోక్ష శాస్త్రం అన్నారు. భాగవతాన్ని సంస్కృతంలో వ్యాసమహర్షి రాయగా దానిని తెలుగులో భక్తకవి బమ్మెర పోతనా మాత్యుడు ఆంధ్రీకరించారు.

శ్రీ మహావిష్ణువు దశావ తారాల వర్ణన వైభవమే మహా భాగ వతం. ధ్రువుడు, ప్రహ్లాదుడు, అంబరీశుడు, ముచి కుందుడు, కుచేలుడు తదితర భాగవతుల గాథల ద్వారా ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందించే మోక్షశాస్త్రం భాగవతం. భాగవతాన్ని భక్తితో వారం రోజులపాటు చదివినా,విన్నా మోక్ష ప్రాప్తి కలుగుతుందని ప్రతీతి అని తులసి రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో సమాజ గౌరవాధ్యక్షుడు పత్తిపాటి చిన సుబ్బయ్య, పొత్తూరి వెంకట నాయుడు, మొలకల వెంకటరమణ, బోనాల చిన్నబయన్న, సమాజ ఉపాధ్యక్షులు కేసనపల్లి నరేంద్ర నాయుడు, మీడియా ఇంచార్జ్ యాగంటి బాలకృష్ణారెడ్డి, భాగవతులు తిమ్మయ్య చౌదరి, గోపాలకృష్ణ, శివనాగిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ తదితర భాగవతులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్

- 24 ఖరీదైన మోటార్ సైకిళ్లు స్వాధీనం..
- సుమారు రూ. 40 లక్షల విలువైన వాహనాలు రికవరీ చేసిన పోలీసులు..
- ముఠాలోని మరో ముగ్గురు రిసీవర్ల అరెస్ట్..
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాతో పాటు పక్క జిల్లాల్లో వరుస మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఒక కిలాడీ దొంగను, అతడి వద్ద నుండి బైకులు కొనుగోలు చేస్తున్న ముగ్గురు రిసీవర్లను పీలేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రాయచోటి లోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఈ కేసు వివరాలను వెల్లడించారు.

రాయచోటి టౌన్, ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఆరిఫ్ (38) అనే వ్యక్తి 2024 చివరి నుంచి చోరీల బాట పట్టాడు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న బైకులను మాయం చేసేవాడు.

**దొంగతనం చేసిన ప్రాంతాలు**

నిందితుడు కేవలం అన్నమయ్య జిల్లాలోనే కాకుండా చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాల్లోనూ తన హస్తలాఘవాన్ని ప్రదర్శించాడు. అన్నమయ్య జిల్లా: రాయచోటి, పీలేరు, కలకడ, సంబేపల్లి, మదనపల్లి, పుంగనూరు.
చిత్తూరు జిల్లా: చిత్తూరు టౌన్, పలమనేరు.
తిరుపతి జిల్లా: తిరుపతి పట్టణం.
కడప జిల్లా: కడప టౌన్, రాజంపేట.

**రికవరీ చేసిన వాహనాలు**

నిందితుడి నుంచి సుమారు 40 లక్షల రూపాయల విలువైన 24 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ముఖ్యంగా ఖరీదైన వాహనాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.
రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) - 17, . బజాజ్ పల్సర్ - 05,. హోండా షైన్ - 01, హీరో స్ప్లెండర్ ప్లస్ - 01

**అరెస్ట్ చేసిన తీరు**

పీలేరు మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోతున్న ఆరిఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు, దొంగిలించిన బైకులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న షేక్ బషీర్ బలిజ గడ్డ గుర్రంకొండ మండలం, షేక్ సయ్యద్ ముక్తియార్ బలిజగడ్డ గుర్రంకొండ మండలం, షేక్ మహమ్మద్ అలీ కోటవీధి చెంబకూరు రామసముద్రం మండలం, ఈ ముగ్గురు రిసీవర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశం సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మరియు వాహన దారులకు పలు కీలక సూచనలు చేశారు చాలా సందర్భాల్లో వాహనదారులు తమ మోటార్ సైకిళ్లకు కేవలం హ్యాండిల్ లాక్ వేసి వదిలేస్తున్నారు. దొంగలు వీటిని సులభంగా విరగ్గొట్టి దొంగిలిస్తున్నారు. కావున, ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు అదనపు సెంట్రల్ లాక్ (వీల్ లాక్) లేదా డిస్క్ లాక్ అమర్చుకోవాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో లేదా వెలుతురు ఉన్న చోట మాత్రమే వాహనాలను పార్క్ చేయాలి."తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి సరైన పత్రాలు (ఆర్సీ, ఇన్స్యూరెన్స్) లేని సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేయవద్దు. ఒకవేళ మీరు కొన్న వాహనం దొంగిలించబడినది అని తెలిస్తే, మీరు కూడా 'రిసీవర్' (నేరానికి సహకరించిన వ్యక్తి) కింద శిక్షార్హుల వుతారు. వాహనం కొనేముందు పోలీస్ వెరిఫికేషన్ లేదా ఆన్‌లైన్ ద్వారా వివరాలు సరిచూసుకోవడంఉత్తమం."""జిల్లా సరిహద్దుల్లో, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నాం. ప్రజలు తమ వీధుల్లో లేదా కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 'డైల్ 112' కి లేదా స్తానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలి. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరం." అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన రాయచోటి డిఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్, పీలేరు సిఐ యుగంధర్, ఎస్ఐ లు, లోకేష్, రహీం, పీలేరు పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ రాధా కృష్ణ, ముని సుందరం, శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ వేణు, ఉపేంద్ర, జగదీశ్, హోంగార్డ్స్ కిరణ్, శివ శంకర్, ముబారక్, తిరుపాల్ నాయక్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





# ప్రతి విద్యార్థి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

## - ఎంఈఓ వెంకట్రామిరెడ్డి





**వేంపల్లె - సూర్య వాస్తవం :** ప్రాథమిక దశనుండే ప్రతి విద్యార్థి ఆకాశమే హద్దుగా ప్రతి అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నతస్థాయి చేరుకోవాలని ఎంఈఓ వెంకట్రామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద వేంపల్లి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలల 5 వ తరగతి విద్యార్థులకు ఒక్కో పాఠశాల నుండి ఇద్దరికి చొప్పున మండల స్థాయి కాంపిటీషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ఆకర్షణీయమైన బహుమతులను అందించారు. మండలం లోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను సమన్వయపరుచుకుని నిర్వహించిన ఈ పోటీ పరీక్ష భవిష్యత్తులో కూడా కొనసాగి స్తామని విద్యా శాఖ అధికారులు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్ తెలిపారు. బహుమతి ప్రదానో త్సవంలో సంఘ నాయకులు సంగ మేశ్వర రెడ్డి, చావలి ఆంజనేయులు, గట్టు వెంకట రమేష్, చెరుకూరి శ్రీనివాసులు, కామేశ్వర రావు, ఉన్నత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు నాగాంజనేయులు, రవి కుమార్, శ్రీనివాస రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసుల రెడ్డి, భాస్కర్ రెడ్డి, సిఆర్‌పిలు కళ్యాణి, రాధ, సూర్యకుమారి, సిబ్బంది అబ్దుల్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు ముందు హామీలు - గెలిచాక అరెస్టులేనా?

- మాట ఇచ్చిన ప్రభుత్వం... ప్రశ్నిస్తే పోలీసు చర్యలా?
- అంగన్వాడీల అరెస్టులపై నాయుడుపేటలో ఆగ్రహావేశం



**నాయుడుపేట - సూర్యవాస్తవం:** గెలుపు ముందు వరాలు కురిపించి, గెలిచాక కనీసం పట్టించుకోకుండా హక్కుల కోసం అడిగిన వారిపైనే అరెస్టులు చేయడం దుర్మార్గమని అంగన్వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. విజయవాడలో హామీల అమలుకోసం నిర్వహించిన మహా ధర్నాలో అంగన్వాడీలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం నాయుడుపేట పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయుడు పేట సిఐటియు కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా కార్మికులు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. అనంతరం మార్కెట్ సెంటర్ వద్ద కళ్లకు చేతులు అడ్డం పెట్టుకుని "ఈ అన్యాయం చూడలేం" అంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుందా, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి నెలవల శ్యామలమ్మ విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు అంగన్వాడీల 42 రోజుల సమ్మె సమయంలో శిబిరాలకు వచ్చి కనీస వేతనం ఇస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ గెలిచిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టమని అడగడానికి వెళ్లిన మహిళా కార్య కర్తలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే చర్య అని అన్నారు. గెలుపు ముందు ఒక మాట, గెలిచాక మరో మాట అనే విధంగా వ్యవహరించడం బాధాకరమ న్నారు. అంగ న్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించా లని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ నిర్మల, కళావతి, నాగమ్మ, వాణి, మున్సిపాలిటీ వర్కర్స్ యూని యన్ నాయకులు రమణమ్మ, సిఐటియు నాయ కులు షేక్ అబ్దుల్లా, షేక్ కాలేషా, ఆటో యూనియన్ నాయకులు మస్తాన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అందించాలి

- అంగన్వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తూ వేంపల్లిలో నిరసన



**వేంపల్లె - సూర్య వాస్తవం :** అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో 36 గంటలు నిరసన దీక్ష చేపడితే తెల్లవారుజామున అంగన్వాడీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయటం సమంజసం కాదని ఏఐటియుసి పులివెందుల ఏరియా కార్యదర్శి బ్రహ్మం కొత్త కాల్వ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతిలు అన్నారు. అరెస్టులను ఖండిస్తూ మంగళవారం వేంపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు అందించాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడి, వర్కర్స్ హెల్పర్స్, సూపర్వైజర్ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ విజయవాడలో 36 గంటల నిరసన దీక్ష చేపడితే 24 గంటలు గడవక ముందే తెల్లవారుజామున దుర్మార్గంగా మహిళలను ఈడ్చుకుంటూ అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఇప్పుడు పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఐఏఎస్ అధికారులు, పోలీసులు అందరూ కూడా అంగన్వాడి కేంద్రాలలో అంగనవాడి కార్యకర్తల చేత గోరుముద్దలు తిన్నవారేనని అటువంటి వారిపై ప్రభుత్వం పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. అంగన్వాడి కార్యకర్తలు గర్భవతులకు, బాలింత లకు, పిల్లలకు పౌష్టికా హారాన్ని అందించడం తోపాటు అనేక సేవలు అందిస్తున్నారు. అటువంటి అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం పేరుతో వాళ్ళ శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. గ్రాట్యుటీ అమలు చేస్తామని సంవత్స రం రోజుల కిందట ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ నేటికీ విధివిధానాలు రూపొందించలేదన్నారు. అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు అందించాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఉపాధ్యాయులు సహాయకురాల ఉద్యోగాలు భర్తీ చేయాలని మినీ అంగన్వాడిలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్చాలని కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఏఐటియుసి లక్ష్మీదేవి, నాగేశ్వరి, లలితక్క, సరస్వతి, శైలు తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ కుటుంబ సభ్యుడు రాజన్నను పరామర్శించిన గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే

**పామిడి - సూర్య వాస్తవం:** పట్టణంలో గత కొద్దిరోజుల క్రిందట తెదేపా నాయకుడు వడ్డే రాజన్న కుమారుడు వడ్డే రవి మరణించడం జరిగింది. ఈ సమాచారం తెలుసుకొన్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు,గుంతకల్లు మాజీ శాసన సభ్యులు ఆర్ జితేంద్ర గౌడ్ మృతుడు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి మృతి పట్ల చింతిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మాజీ తెదేపా అధ్యక్షులు జింకల రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ వై. యు. రామాంజనేయులు, గుత్తి మండలం మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, పార్లమెంట్ తెలుగు మహిళా కార్యదర్శి బండి లక్ష్మీదేవీ, గుత్తి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, దశరద, శంకర్ రెడ్డి తదితరులు పరామర్శించారు.

## మానసిక వికలాంగులకు అన్నదానం

**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్డు లోని దీనబంధు మానసిక వికలాంగుల కేంద్రంలో తొండూరు మండలం ఇనగనూరు గ్రామ వైకాపా నాయకుడు లక్ష్మారెడ్డి మేనల్లుడు జనార్దన్ రెడ్డి 7వ పుట్టినరోజు సందర్భంగా మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి తల్లిదండ్రులు జనార్దన్ రెడ్డినిబర్తే పార్టీకి కేక్ కట్ చేస్తావా, లేక అన్నదాన కార్యక్రమం చేద్దామా అని అడిగితే చిన్న వయసులోనే మంచిగా ఆలోచన అన్నదాన కార్యక్రమం చేద్దామని కోరాడు. జనార్దన్ రెడ్డి కోరిక మేరకు దీనబంధు మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. జనార్దన్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులో మరెన్నో జరుపుకోవాలని, ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు ఎన్నో చెయ్యాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వారు తెలిపారు.

## పట్టణంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్



**వేంపల్లె - సూర్య వాస్తవం:**
వేంపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో మంగళవారం పట్టణంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫోర్ రోడ్ జంక్షన్ వరకు పోలీసులు పాదయాత్ర ద్వారా గస్తీ నిర్వహించారు. ఫుట్ పెట్రోలింగ్ సందర్భంగా, గాంధీ రోడ్డులో అనధి కారికంగా ఏర్పాటు చేసిన వ్యాపారాలు, ఇతర ఆక్రమణలను పోలీసులు తొలగించారు. సిఐ నరసింహులు మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల భద్రత, ట్రాఫిక్ సౌకర్యం, పాదచారుల సౌకర్యం కోసం ఈ చర్యలు చేపట్టాము అని తెలుపుతూ, ప్రజలు రోడ్ల ఆక్రమణలు నివారించాలి, ట్రాఫిక్ నియమాలు పాటించాలి అని చెప్పారు. పట్టణంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా కొనసాగనున్నాయని పోలీసులు తెలిపారు.



## రంగస్థలం కళాకారుడు ఆంథోనీరావు కన్నుమూత





**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన వజ్రకరూర్ గ్రామనివాసైన పౌరా ణిక రంగస్థల కళాకారుడు ఆంటోనీ రావు అనారోగ్యంతో గుంతకల్ పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈయన దాదాపు 40 సంవత్సరాలుగా పౌరాణిక రంగస్థలనటుడిగా కళలే తన ఊపిరిగా కళాపిపాసిగా జీవిస్తున్నాడు. రంగస్థలంపై అశ్వత్థామ అర్జున నక్షత్రాక పాత్రలలో దాదాపు 400 ప్రదర్శనలు ఇచ్చాడు. ఇతను పామిడి స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయము కమిటీలో కార్యదర్శిగా విధులు నిర్వ హించారు. ప్రముఖులచే ఎన్నో సన్మానాలు ప్రశంసా పత్రాలు పొందాడు. ఇతనికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన నక్షత్రక పాత్రలో లీనమై జీవించేవాడు. ఇతను పామిడి స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.దేవరాజుకు స్వయానా బావమర్ది అవుతాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఇద్దరు కూతుర్లు కలరు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించను న్నారు. ఇతని మృతి పట్ల పామిడి స్వరరాగ కళా సమితి కమిటీ సభ్యులు అశ్రు నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సంతాప కార్యక్రమంలో ఎం దేవరాజు, పుంజా కృష్ణారావు, పెద్దతిరుపాలు, బెస్తసుబ్రహ్మణ్య, హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి, బ్రహ్మయ్య, చిన్నఆంజనేయులు, టి.నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీటర్ ఇంగ్లాండ్ షోరూమ్‌లో భారీ అగ్ని ప్రమాదం

- లక్షల్లో ఆస్తి నష్టం, అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది




**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని బోలే వార్డులో ఉన్న పాత కరెంటు కార్యాలయం సమీపంలోని 'పీటర్ ఇంగ్లాండ్' బట్టల దుకాణంలో మంటలు చెలరేగాయి.
విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ మంటల ధాటికి దుకాణంలోని కంప్యూటర్లు, విలువైన వస్త్రాలు పూర్తిగా కాలిపోయాయి. దీనివల్ల సుమారు 15లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు వేగంగా వ్యాపించినప్పటికీ, అగ్నిమాపక సిబ్బంది సమయ స్ఫూర్తితో వ్యవహరించి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అరికట్టారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## చంద్ర గ్రహణం - ఆలయాలు మూసివేత



**పులివెందుల - సూర్య వాస్తవం :** చంద్రగ్రహణం వలన పులివెందుల పట్టణ పరిధిలోని పలు ఆలయాలు మూసి వేసినట్లు ఆలయ అధికారులు ఆలయ చైర్మన్లు ప్రధాన అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా ఆయా ఆలయ ప్రధాన అర్చకులు నేతృత్వంలో ఉదయం పూజ కైంకర్యాల అనం తరం 10 గంటలకు ఆలయం తలుపులు మూసివేసినట్లు తెలిపారు. తిరిగి బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన,నివేదన, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించానున్నారు. అనంతరం ఉదయం 7గంటల నుండి యధావిధిగా భక్తులకు సర్వ దర్శనం కల్పించనున్నారని తెలిపారు.

## పెన్నహోబిలం పుణ్యక్షేత్రం ....



**ఉరవకొండ - సూర్య వాస్తవం :**
ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా తాత్కాలికంగా మూసివేశారు. గ్రహణం ప్రారంభానికి ముందే మంగళవారం ఆలయ ద్వారాలను మూసి వేసిన అర్చకులు, అధికారులు సంప్రదాయ ఆచారాలను పాటించారు. గ్రహణం ముగిసిన తర్వాత బుధవారం ఉదయం ఆలయ శుద్ధి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 6 గంటల తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులు సహకరించాలని కోరారు.

- ప్రజాసేవ పరమావదిగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు..
- కంటి దంత వైద్య శిబిరంలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి

## మున్సిపల్ శానిటేషన్ ఉద్యోగులకు

# ఉచిత కంటి వైద్యం..






**రాయదుర్గం – సూర్య వాస్తవం:** పట్టణంలోని చంద్రశేఖర్ మెడికల్ అండ్ క్లినిక్ వారి ఆధ్వర్యంలో స్వదేశీ దిశా కేరామృత్ సంస్థ ఏజెంట్ టీవీ నాయుడు సహకారంతో మునిసిపాలిటీ శానిటైజర్ ఉద్యోగులకు ఉచిత కంటి దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాపు రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ... సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛందంగా చంద్రశేఖర్ మెడికల్ అండ్ క్లినిక్ ఆధ్వర్యంలో స్వదేశీ దిశా కేరామృత్ సంస్థ తేజ నాయుడు సహకారంతో ఈ మహోత్తరమైన సేవా కార్యక్రమం చేయడం గర్వకారణ మన్నారు.

వైద్యులను సామాకరించే పట్టణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గర్వకారణమని గతంలో కూడా అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల శిబిరా లను నిర్మించి ప్రజలకు సేవలు అందించాలని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ జివి నాయుడు కంసులర్ ఉన్నారప్ప డిష్ పోయిందో కౌన్సిలర్ షబ్బీ రాయదుర్గం రూరల్ బిజెపి మండల అధ్యక్షులు నాగరాజు అనంతపురం జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యురాలు హానిత పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు భీమ్సేన్ డాక్టర్ మల్లికార్జున జకాతి కృష్ణ వాల్మీకి పవన్ వీరశేఖర్ చదం చిప్పేస్వామి నాగరాజు జయరాం బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య




**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** అంగన్వాడీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు అధ్యక్షురాలు జాల సుకుమారి పేర్కొన్నారు. రెండవ తేదీన అన్ని జిల్లాల నుండి విజయవాడ ధర్నాకు పిలుపునిచ్చారు. విజయవాడలో ధర్నా నిర్వహించిన అంగన్వాడి జిల్లా నాయకులను అరెస్టు చేయడం చాలా బాధాకరమని ఆరెస్టులకు నిరసనగా లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ఆఫీసు వద్ద అంగన్వాడి టీచర్లు ఆయాలు పెద్ద ఎత్తున చేరుకుని శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాల సుకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమ్మెలు, ధర్నాలు మేము చేస్తున్నపుడు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పుడు రెండు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ హామీని నెరవేర్చలేదని ఆమె ఏద్దేవా చేశారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆమె కోరారు. ఖాళీగా ఉన్న సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు పెరిగిన ధరలతో కుటుంబాన్ని నెట్టుకు రావడం చాలా కష్టంగా ఉందని వాపోయారు ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మాకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలిపారు. లేనిపక్షంలో మా నిరసనను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు కార్యదర్శులు ఓబులమ్మ, ప్రభావతి, సెక్టర్ నాయకులు శిరీష, నాగమణి, రుక్మిణి గంగమ్మ, ప్రసన్న, శ్రీవాణి, అనిష, శారదా మూడు మండలాల అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు



## లేగదూడల ప్రదర్శన.....

### - జాతి దూడలకు బహుమతులు

**డక్కిలి– సూర్య వాస్తవం, మార్చి 03:** డక్కిలి మండలం మోపూరు గ్రామంలో మంగళ వారం పశు గణాభివృధి సంఘం, కోవూరు, నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్ లో భాగంగా లేగ దూడల అందాల పోటీలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మోపూరు గ్రామం లోని లేగ దూడలను ప్రదర్శన చేశారు. మంచి జాతి లక్షణాలు కలిగిన దూడలను అధికారులు ఎంపిక చేసి బహుమతులను బహూకరించారు. అలాగే పాల్గొన్న ప్రతి రైతుకు కార్య క్రమంలో పాలుపంచుకున్నందుకు బహుమతులను ఇచ్చారు. పాల్గొన్న ప్రతి రైతు కు ఖనిజ లవణ మిశ్రమం, లేగ దూడలకు ఖనిజ లవణ ఇటుకలను పంచారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి కార్యనిర్వహణ అధికారి, పశు గణాభివృధి సంఘం, కోవూరు మాట్లాడుతూ ప్రతి రైతు కృత్రిమగర్భధారణ ద్వారా మేలు జాతి దూడలను పొందాలని, అలాగే ప్రస్తుతం రాయితీ పై లింగ నిర్ధారిత వీర్యం పశు వైద్యశాలలో అందుబాటులో ఉంది అన్నారు. వెంకటగిరి ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీహరి, డక్కిలి పశు వైద్యశాల డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ ఖనిజ లవణ మిశ్రమం ఆవశ్యకత గురించి, దూడ పుట్టినప్పటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో డక్కిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గోను రాజశేఖర్, మోపూ రు టిడిపి నాయకులు సొసైటీ అధ్యక్షులు పులి జనార్దన్ రెడ్డి, డక్కిలి టిడిపి మండలాధ్యక్షులు పోలవరం కోటేశ్వర్ రెడ్డిలు బహుమతుల ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమం పశు వైద్యాధికారి డాక్టర్ రాధా రాణి, పశు వైద్యాధికారి, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం, కోవూరు డాక్టర్ రామచంద్ర రెడ్డి, డక్కిలి మండల పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామికి ప్రతిమను అందజేసిన హీరో షోరూం ఓనర్



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని బ్రహ్మంగారి మఠం మఠాధిపతి మందిరంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారికి పోరుమామిళ్ల హీరో షోరూం ఓనర్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ అధ్యక్షులు తులసి సురేష్ బాబు కుటుంబ సమేతంగా స్వామివారిని కలిసి ఆశీర్వాదం పొంది శాలువాతో సన్మానించి శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను సమర్పించారు.

## ఘనంగా శ్రీ కొండా సింగ రాయుడు స్వామి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని మిట్టమానపల్లె వెళ్లే దారిలో శ్రీఈశ్వరమ్మ గృహ దగ్గరలో ఉన్న శ్రీ కొండ సింగరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగినట్లు దేవదాయ శాఖ ఆలయ ఈవో తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కొండ సింగ రాయుడు స్వామి ఉత్సవాలు మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, గ్రామస్తులు భజన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు స్థానిక ప్రజలు, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి కాయ, కర్పూరం అందజేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు.

## ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**వేంపల్లె – సూర్య వాస్తవం:** శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆయన అభిమానులు ఆకుల సురేష్, ఆకుల వరలక్ష్మి, చరణ్, లోకేష్‌లు పేర్కొన్నారు. మంగళవారం బుడ్డా రాజశేఖర రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పాత గండి రోడ్డు నందు గల మదర్ థెరిస్సా అనాధ వృద్ధాశ్రమం లో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అనాధ వృద్దులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆకుల సురేష్ మాట్లాడుతూ అనాధ వృదా ్ధశ్రమంలో వృద్దుల మధ్య బుడ్డా రాజశేఖర రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నీతికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం బుడ్డా రాజశేఖర రెడ్డి అని కొనియాడారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉండే నాయకుడిగా మంచి పేరు ప్రఖ్యాతులు సంపా దించుకున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, కమటం హరికుమార్ రెడ్డి, జనసేన నాయకులు దాసరి రవిశంకర్, జనసేన మండల యువ నాయకులు గోసల ఆంజనేయులు, తదితర అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంటా శ్రీనివాసరావును కలిసిన పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి




**పులివెందుల – సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గంటా శ్రీనివాసరావు స్వగృహంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఉభయ నాయకులు పలు రాజకీయ అంశాలపై చించుకొని,ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలుస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమన్వయం చేయడం వంటి విషయాలపై సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు నుంచి బీటెక్ రవి కొన్ని సూచనలు తీసుకున్నట్లు సమాచారం.

## ఉచిత వైద్య శిబిరం




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ ఆసుపత్రిలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు మహిళల కోసం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ భాష, డిఎస్పీలు మహబూబ్ బాషా, శ్రీనివాసరావు, నీలకంఠేశ్వర్ రెడ్డి, పోలీస్ డాక్టర్ కౌసర్ బేగం, సిఐలు వెంకటేశ్వర్లు, వెంకటేష్ నాయక్, శ్రీకాంత్ యాదవ్, ఆర్ఐలు మధు, పవన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. శిబిరంలో మహిళా పోలీస్ సిబ్బంది, జీఎంఎస్‌కేలు, హోం గార్డులు, మహిళా ఆటో డ్రైవర్లు, డ్వాక్రా మహిళలు, తదితరులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు ఇ.సి.జి, 2 డి ఎకో, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు మరియు మందులు అందజేశారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్లు సూచించారు.





# అందరినీ అలరించే సరికొత్త కథతో ...

”రాకాస’ సినిమా కొత్తగా ఉంటుంది. అందర్నీ నవ్విస్తుంది. ప్రేక్షకులు ఖర్చుచేసే టికెట్ డబ్బులకు న్యాయం చేసేలా ఉంటుంది. నిహారిక, మానస గార్ల వల్లే ఈ స్థాయిలో ఉన్నా. ఈ చిత్రంతో సంగీత్ యాక్టర్‌గా మరింత షైన్ అవుతాడు. థియేటర్లకు వచ్చిన ఆడియన్స్ చక్కటి ఎంజాయ్ చేస్తారు. చిత్ర యూనిట్ అంతా ఎంతో కష్టపడి పనిచేశాం.

ప్రేక్షకులు మా సినిమాని సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాం. అన్ని తరగతుల ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలని కోరుతున్నా’ అని కథానాయకుడు సంగీత్‌శోభన్ అన్నారు. సంగీత్‌శోభన్, నయన్ సారిక జంటగా మానస శర్మ దర్శకత్వం వహించిన సినిమా ‘రాకాస’. జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై నిహారిక కొణిదెల, ఉమేష్‌కుమార్ బన్సాల్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సంగీత్‌శోభన్ పై విధంగా మాట్లాడారు.

జీ5 తెలుగు కంటెంట్ హెడ్ దివ్య, సంగీత దర్శకుడు అనుదీప్, నటీనటులు రోహిణి, గెటప్ శ్రీను మాట్లాడుతూ ‘రాకాస’ సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరారు.

# ‘పెద్ది’ రన్‌టైమ్ పుకార్లు నమ్మొద్దు




రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబోలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ సినిమా రన్నింగ్‌టైమ్‌పై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మొద్దని చిత్ర యూనిట్ కోరింది. ఈ సినిమా నిడివి 3 గంటలకు పైగా ఉంటుందని నెట్టింట గత కొన్ని రోజులుగా వైరల్ అవుతోంది. ఈ విషయంపై చిత్ర యూనిట్ స్పందించింది. ‘ప్రస్తుతానికి ఫస్టాఫ్ ఎడిటింగ్ మాత్రమే పూర్తయ్యింది. సెకండాఫ్ షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. అలాంటప్పుడు నిడివి గురించి వస్తున్న ప్రచారంలో నిజం లేదు’ అని స్పష్టం చేసింది. సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎడిటింగ్ టేబుల్ ఉన్నప్పుడు ఇలాంటి పుకార్లను నమ్మొద్దని కోరింది.

### చిరు ప్రశంసలు

పెద్ది సినిమాలోని ‘రయ్ రయ్ రారా’ పాట చాలా బాగా వచ్చిందనీ, రామ్‌చరణ్ డ్యాన్స్ మెచ్చుకునేలా ఉందని సీనియర్ నటుడు చిరంజీవి అన్నారు.

# సూర్య .. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’



సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా పేరు ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ అని తెలుపుతూ చిత్రబృందం సూర్య ఫస్ట్ లుక్ విడుదలచేసింది. 2026 జూలైలో థియేటర్లకు వస్తున్నట్లు కూడా మేకర్స్ ప్రకటించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మలయాళ నటి మమితా బైజు ఈ చిత్రంలో కథానాయికగా చేస్తున్నారు. రవీనా టాండన్ ప్రధాన పాత్రలో కనిపించ నున్నారు. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు.



# అగ్రస్థానంలో మంధాన




## - ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానానికి ఎగబాకింది. ఐసిసి మంగళవారం విడుదల చేసిన బ్యాటర్ల జాబితాలో మంధాన 790 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో మంధాన ఒక అర్ధ సెంచరీతో రాణించింది. దీంతో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(780)ను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వన్డే సిరీస్‌లో భారత్‌పై సెంచరీలు సాధించిన బెత్ మూనీ(749), అలీసా హీలీ(744) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. టీమిండియా బ్యాటర్లలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(652) 9వ స్థానంలో ఉండగా.. జెమీమా రోడ్రిగ్స్(635) 12వ స్థానానికి పరిమితమైంది. ఇగ బౌలింగ్ ర్యాంకింగ్స్ జాబితా విషయానికొస్తే.. ఇటీవల ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న స్టార్ బౌలర్ దీప్తి శర్మ(614) పదో స్థానానికి పడిపోయింది. ఆస్ట్రేలియా ప్లేయర్ అలానా కింగ్(775) అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో సోఫీ ఎకిల్‌స్టన్(747), ఆష్లీ గార్డ్‌నర్(713) కొనసాగుతున్నారు. ఇక టి20 ర్యాంకింగ్స్‌లో బెత్ మూనీ 787 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. మంధాన 770 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

కాగా జెమీమా రోడ్రిగ్స్(644) 11వ స్థానం, హర్మన్ ప్రీత్ కౌర్(638) 15వ స్థానాల్లో కొనసాగుతున్నారు. టి20 బౌలింగ్ జాబితాలో పాకిస్థాన్ ప్లేయర్ సాదియా ఇక్బాల్ 743 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత స్థానాల్లో సదర్లాండ్(729), సూఫీ ఎకిల్‌స్టన్(727), దీప్తి శర్మ(717) ఉన్నారు.

# టాప్‌సీడ్‌కు లక్ష్యసేన్ ఝలక్

## - అల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

లండన్: అల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ పెను సంచలనాన్ని నమోదు చేశాడు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ ఏకంగా టాప్‌సీడ్, చైనాకు చెందిన షీ-యుకీని చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరాడు. తొలిరౌండ్‌లో లక్ష్యసేన్ 23-21, 19-21, 21-17తో టాప్‌సీడ్‌పై విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్ తొలి సెట్‌ను పోటాపోటీగా తలపడి మరీ విజయం సాధించాడు. చివర్లో వరుసగా రెండు పాయింట్లు సాధించి ఆ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లోనూ ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చినా.. చివర్లో ఓటమిపాలయ్యాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్ కూడా హోరాహోరీగానే సాగింది. ఈ క్రమంలో ఆ గేమ్‌ను 21-17తో ముగించి రెండోరౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో పివి సింధు టోర్నీనుంచి నిష్క్రమించగా.. మాళ్విక బన్సోద్ తొలిరౌండ్‌లోనే నిష్క్రమించింది. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో బన్సోద్ 11-21, 9-21తో 3వ సీడ్, చైనాకు చెందిన చెన్ యూఫీ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. ఇక మిక్సడ్ డబుల్స్‌లో తానీసా కాస్ట్రో-ధ్రువ్ కపిల జంట రెండోరౌండ్‌కు చేరింది. రెండోసెట్ల హోరాహోరీ పోరులో తానీసా-ధ్రువ్ కపిల 21-17, 21-19తో మలేషియా జంటను చిత్తుచేశారు.



# నారా లోకేష్‌తో ఆత్మీయ కలయిక

- ఎమ్మెల్యే విజయ శ్రీ
- సూళ్లూరుపేట ప్రజా సమస్యలపై చర్చ
- ఏకతాటిపైకి నాయకత్వం



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ, తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. నియోజక వర్గాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పని చేయాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రజా ప్రతినిధులు సంకల్పం వ్యక్తం చేశారు. "ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మనందరి బాధ్యత" అని వారు తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో అందరూ కలిసి పాల్గొని పరస్పర స్నేహ భావాన్ని వ్యక్తపరిచారు.

ప్రజా ప్రతి నిధులను ఏకతాటి పైకి తెచ్చినందుకు మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అంశాలను కూడా ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# అంకితభావంతో పనిచేసిన వాళ్లకే పదవులు...

- జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలు...
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధనూరు నాగరాజు ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేత
- నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన చిందనూర్ నాగరాజ్




**రాయదుర్గం - సూర్య వాస్తవం:** బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింధనూర్ నాగరాజును నియమించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధనూర్ నాగరాజ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్.. జిల్లా బిఎస్పి అధ్యక్షులు కాసాని నాగరాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా బీఎస్పీ నూతన కమిటీలను సభ్యులను ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.. చిందనూరు నాగరాజు మాట్లాడుతూ... అంకితభావంతో పనిచేసిన ప్రతి వ్యక్తిని బీఎస్పీ పార్టీ గుర్తించి ఉన్నతమైన పదవులను కట్టుబెట్టిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోషం వ్యక్తపరిచారు. బిఎస్పి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన నన్ను.. రాష్ట్ర అధ్యక్షులు బిందెల గౌతమ్ కుమార్.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం. బీఎస్పీ వ్యవస్థాపకులు మాయావతికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాని కార్యదర్శి ఓదాల్లో జిల్లాకు విచ్చేసిన నాగరాజుకు బిఎస్పి క్యాడర్ ఘన స్వాగతం పలికి ఘన సన్మానాలు చేశారు. అనంతరం. రాయదుర్గం నియోజకవర్గం ఇంచార్జ్ కృష్ణ. అధ్యక్షులు జయచంద్ర, ఉపాధ్యక్షులు ప్రకృతి కార్యదర్శి తిప్పేస్వామి పొన్నూరు స్వామి వెంకటేష్ తిప్పే స్వాములు పాల్గొన్నారు. వైశ్య సామాజిక వర్గానికి చెందిన నగరూరు చంద్ర మహేష్ చెక్కా నాగేంద్ర గార్లదిన్నె సురేష్ కందూర్ విజయ్ కుమార్ బేకరీ శ్రీనివాసులు హంపాపురం బాబు గంగినేపల్లి దినేష్ మాదాలం సురేష్ కురిడి వెంకటేష్ ఇల్లూరి శ్రీనివాసులు కుప్పం శ్రీనివాసులు తత్తర్లు పాల్గొన్నారు. ముఖ్యంగా మొట్టమొదటిసారిగా బహుజన సమాజ్వాది పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమపడి కృషిచేసి పార్టీ కోసం పనిచేసిన చిందునూరు నాగరాజుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జిల్లాకు మొట్టమొదటిసారిగా రావడంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సన్మానించడానికి పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా ప్రజలు తండోపతండాలుగా వచ్చి చిందనూరు నాగరాజును ఘన సన్మానాలు చేశారు. అనంతరం.. ప్రజలు బిఎస్పి నాయకులు మాట్లాడుతూ.. బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ బహుజన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన చిందనూరు నాగరాజుకు పార్టీ గుర్తించి రాష్ట్రస్థాయిలో పదవులు కట్టబెట్టడం సంతోషకరమని పార్టీ వ్యవస్థాపకలను ప్రజలు పార్టీ నాయకులు కొనియాడారు.





## ధర్మపురం గ్రామానికి
## రూ.96 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం



**గుత్తి - సూర్య వాస్తవం:** మండలంలోని ధర్మపురం గ్రామంలో తారు రోడ్డు వేయిస్తున్న గుం తకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తనయుడు గుత్తి, పామిడి ఇం చార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వ ర్ నెల కిందట గుంతకల్లు నియోజకవర్గం ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి నప్పుడు గుత్తి మండల ధర్మపురం గ్రామస్తులు అందరు కలిసి రోడ్డు కా వాలని ఎమ్మెల్యేకి అర్జీ ఇవ్వడంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి గుత్తి మండలం ధర్మపురం గ్రామానికి రూ.96 లక్షలతో కరెంటు ఆఫీస్ నుంచి ధర్మపురం గ్రామం వరకు తారు రోడ్డు తీసుకు వచ్చారు. ధర్మపురం గ్రామ ప్రజలు మాట్లాడుతూ 30 సంవత్సరా లో ఎంతమంది ఎమ్మెల్యేలు వచ్చి పోయిన ఏ ఒక్కరు ధర్మపురం గ్రామాన్ని పట్టించు కున్న వారే లేరు. అ లాంటిది గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకుపోయిన వెంటనే మా గ్రా మానికి కరెంటు ఆఫీస్ నుంచి ధర్మ పురం గ్రామం వరకు తారురోడ్డు వేయించడం జరుగుతుంది. ధర్మపురం గ్రామ ప్రజలు టీడీపీకి, గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని తెలియజేశారు.


## రోడ్డు దాటుతున్న వ్యక్తి దుర్మరణం



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లాలోని పెళ్లకూరు మండలం పరిధిలో నాయుడుపేట--పూతలపట్టు జాతీయ రహదారి (ఎన్హెచ్-71)పై సోమవారం తెల్లవారుజామున విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చంబడిపాళ్యం వద్ద ఉదయం సుమారు 5:40 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల మేరకు, మనుబోలు గ్రామానికి చెందిన మధుసూదన్ (41) పొలాల నుంచి రోడ్డు దాటి ఇంటికి వెళ్తుండగా, గుర్తుతెలియని వేగవంతమైన వాహనం ఢీకొట్టింది. ఢీకొట్టిన వాహనం ఆగకుండా పరారైనట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన మధుసూదన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటన గురించి సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పెళ్లకూరు ఎస్సై ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ దృశ్యాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏ
# రెన్యువల్ చేయాలి

**'ప్రజాబలం సంఘం' ఆధ్వర్యంలో భారీ రథయాత్ర**



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** బెలుగుప్ప మండల పరిధిలో ఆర్డీటీ సంస్థ ఎఫ్.సి.ఆర్.ఏ లైసెన్స్‌ను వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాబలం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామప్ప నాయక్, సీబీటి చిత్తప్ప చేపట్టిన రథయాత్ర మరియు సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఆర్డీటీ సంస్థ పురుడు పోసుకున్న పుణ్యభూమి బ్రాహ్మణపల్లి తాండ గ్రామం నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర, ప్రస్తుతం నియోజకవర్గంలోని పల్లె పల్లెకు చేరుకుంటోంది. ఈ సందర్భంగా రామప్ప నాయక్ మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా అనంతపురం జిల్లా అభివృద్ధిలో, పేదల అభ్యున్నతిలో ఆర్డీటీ పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.

**ప్రజా మద్దతు:** ప్రతి గ్రామంలోనూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాల సేకరణలో పాల్గొంటున్నారు.

**కలెక్టరేట్ ముట్టడి:** ఈ నెల 8వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున సంతకాల సేకరణ అర్జీలను సమర్పించే కార్యక్రమం ఉంటుంది. ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేసారు.

## పిరమిడ్ ధ్యానమందిరంలో ధ్యానం నిర్వహించిన రాజేష్ మాస్టర్



**శింగనమల - సూర్య వాస్తవం:** బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ దివ్య ఆశీస్సులతో సదానంద యోగి దివ్య స్ఫూర్తితో శింగనమల గ్రామంలో శ్రీ బుశ్యశృంగ మహర్షి పిరమిడ్ ధ్యాన మందిరంలో 41 రోజుల ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో భాగంగా 10వ రోజు మంగళవారం జ్ఞాన దాత రాజేష్ మాస్టర్ ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించబడునన్నారు. ఈ కార్యక్రమం అనంతపురం రుద్రంపేట శ్రీనివాసులు మాస్టారు శింగనమల మాస్టర్స్ ఆధ్వర్యంలో జరుగుతుంది.

## మహిళా భద్రత, గౌరవం, సాధికారతపై అవగాహన ర్యాలీ



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు కూడేరు మండల పరిధిలో మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై సమాజంలో అవగా హన పెంపొందించడంలో భాగంగా కూడేరు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి సాయిబాబా గుడి వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. కూడేరు పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది, శక్తి టీమ్స్, యువ పోలీస్ సిబ్బంది. ఉత్సాహంగా పాల్గొని మహిళలకు, సామాన్య ప్రజలకి అవగాహన కల్పించారు.

## వాహనదారులు లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలి

**- వాహనాలు తనిఖీలు ట్రాఫిక్ సిఐ**

**పులివెందుల - సూర్య వాస్తవం:** వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ట్రాఫిక్ సిఐ హాజీ వలిఅన్నారు. మంగళవారం పట్టణంలోని పూలంగల సర్కిల్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ఇంటి నుండి బయటకు వచ్చేటప్పుడు లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్‌లు ద్విచక్ర వాహ నాలు నడిపితే కఠిన చర్యలు తప్పని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )